మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం



గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఈనెల 28న కొత్తపేట్ జగ్జీవన్ రామ్ భవన్‌లో నిర్వహిస్తున్న మేరు టైలర్స్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. మేరు సంఘం రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఆడపా వెంకటేశ్వరరావు, ఎస్.బి.సంగేవార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వెంకటేశ్, కొత్తపల్లి రమేశ్ తదితరులు ఆదివారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ..రాష్ట్రంలో మేరు కులస్తుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని..ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న మేరు టైలర్స్ డే వేడుకలను రాష్ట్ర మేరు సంఘం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. మేరు కులస్తులు అందరూ పెద్ద సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



వేడుకల్లో ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ తదితరులు

జియాగూడ: ఇమాంపురాలో ఇటీవల ప్రతిష్ఠించిన బొడ్రాయి, రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాలను ఘనంగా నిర్వహించినట్లు నవభారత సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. ఆదివారం నవభారత్ సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం అఖండ హారతి అనంతరం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో సలహాదారులు జె.అర్జున్‌కుమార్, సంఘం ప్రతినిధులు డి.సంతోష్‌కుమార్, వినయ్‌కుమార్, జశ్వంత్‌కుమార్, మహేష్‌బాబు, బాలకిషన్, నర్సింగ్‌రావు, గౌతమ్, ఎ.యశ్వంత్‌కుమార్, ప్రేమ్‌కుమార్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యాకుత్‌పురా రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులకు శంకుస్థాపన

యాకుత్‌పురా: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పాతబస్తీలోని యాకుత్‌పురా రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి నిర్మాణ పనులకు సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని యాకుత్‌పురా కార్యక్రమ ఇన్‌చార్జ్, హైదరాబాద్ డీఎఫ్ఎం వై.సందీప్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉదయం 10.30 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ.. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రులు రావ్ సాహెబ్ పాటిల్ దన్వే, దర్శన జర్దోష్‌లతో కలిసి దేశవ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్లు, 1500 బ్రిడ్జిలకు శంకుస్థాపన చేస్తారని వారు తెలిపారు.

పునరాభివృద్ధిపై హర్షం....

ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో యాకుత్‌పురా రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయడం శుభపరిణామమని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కామాటి మహేశ్వర్, యాకుత్‌పురా కంటెస్టెడ్ ఎమ్మెల్యే వీరేందర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వారు యాకుత్‌పురా రైల్వే స్టేషనలో జరుగుతున్న ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా మోదీ దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.

'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదు'



ఇమ్రాన్ అలీఖాన్‌కు కాంగ్రెస్ కండువా వేస్తున్న దీపాదాస్ మున్షీ

గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని ఆ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ యువజన నాయకుడు ఇమ్రాన్ అలీఖాన్ లడ్డూ తన 50 మంది అనుచరులతో ఆదివారం గాంధీ భవన్‌లో దీపాదాస్ మున్షీని కలిశారు. ఈ సందర్భంగా నగర మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ ఇమ్రాన్ అలీఖాన్‌ను దీపాదాస్ మున్షీ చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ అలీఖాన్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: సాహిత్యమంటే మనుషుల మనసుల ప్రేమ నుంచి పొందిన అనుభూతికి రచనా రూపమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రచయితల సంఘం, ఆసిఫాబాద్ కవులు సంఘంల ఆధ్వర్యంలో నల్గొండ రమేష్ రచించిన కూడలి చెట్టు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షులు నందిని సిద్దారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, జంటనగరాల శాఖ అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, గుర్రాల వెంకటేశ్వర్లు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రినాక ఏసీపీకి సన్మానం

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీసు సబ్ డివిజన్ ఏసీపీగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ చంద్రశేఖర్‌ను గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావ్ ముదిరాజ్ ఆదివారం సన్మానించారు. ఈ ప్రాంతంపై పట్టున్న ఏసీపీ ఆధ్వర్యంలో నేరాలు తగ్గుముఖం పడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా డివిజన్‌లోని ఛత్రినాక, శాలిబండ, మొఘల్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటానని ఏసీపీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ బరాత్



మాట్లాడుతున్న మౌలానా ఖారీ మతీన్ అలీషా



మీర్ కా దాహేరా శ్మశాన వాటిక వద్ద ..

గోల్కొండ: షబ్ ఏ బరాత్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని ఆల్ ఇండియా సీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాలా బజార్‌లోని అస్కరి మసీద్‌లో జరిగిన షబ్ ఏ బరాత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ షబ్ ఏ బరాత్ రాత్రి జాగరణ చేయడమే కాకుండా నమాజ్ ఆచరిస్తే ఎన్నో పుణ్య ఫలాలు దక్కుతాయన్నారు. ప్రవక్త మహ్మద్ షబ్ ఏ బరాత్ రోజు రాత్రి శ్మశాన వాటికలో ప్రార్థనలు చేశారని ఈ విషయం దివ్య ఖురాన్ గ్రంథంలో ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ రిసాలాబజార్, బంజారి దర్వాజ తదితర ప్రాంతాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

పాతబస్తీలో...

చార్మినార్: షబే ఏ బరాత్‌ను పురస్కరించుకుని పాతబస్తీలోని ముస్లింలు ఆదివారం రాత్రంతా జాగరణ చేసి తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాల్లోని ముస్లింలు ఆయా ప్రాంతాల్లోని శ్మశాన వాటికల వద్దకు వెళ్లి తమ పూర్వీకుల సమాధులపై పులు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ముస్లిం మత పెద్దలు సమావేశాలు నిర్వహించి షబే ఏ బరాత్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

పూలు, గులాబీ పూరేకులకు డిమాండ్

గోల్కొండ: షబ్ ఏ బరాత్ సందర్భంగా పూలకు బాగా డిమాండ్ పెరిగింది. రాత్రి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు శ్మశానవాటికలను సందర్శిస్తారు. ఈ సందర్భంగా వారు చనిపోయిన తమ కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమాధులపై పూలు సమర్పిస్తారు. ఇందు వల్లే షబ్ ఏ బరాత్ రోజు పూలు బాగా అమ్ముడవుతాయి. పూలతో పాటు గులాబీ పూరేకులు సైతం బాగా అమ్ముడవుతాయి. మాసాబ్ ట్యాంక్ అహ్మద్ నగర్, మెహిదీపట్నం, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లో మసీదులు ముస్లిం శ్మశానవాటికల వద్ద పూలు బాగా అమ్ముడయ్యాయి.



పూలు అమ్ముతున్న వ్యాపారులు

వైభవంగా బంగారు మైసమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన



గాజుల అంజయ్యను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: రాంసింగ్ బాడలోని బంగారు మైసమ్మ మహాకాళి విగ్రహ పునః ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా జరిగాయి. జగద్గురువులు హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతీ మహాస్వామి చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం తదితర పూజా కార్యక్రమాలుజరిగాయి. ముగింపు పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మహాకాళి అమ్మవారికి స్థానిక భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్, అభిమన్యు తదితరులు ఈ పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, అధ్యక్షుడు సురేష్ యాదవ్, శ్రీకాంత్ తదితరులు వారిని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం



బీజేపీ సంకల్ప యాత్రలో పాల్గొన్న ముక్క కృష్ణగుప్తా, దాసరి చంద్రశేఖర్

అబిడ్స్: రాబోయే ఎన్నికల్లో హైదరాబాద్‌తో పాటు అన్ని పార్లమెంట్ స్థానాల్లో బీజేపీదే విజయమని రాష్ట్ర బీజేపీ నాయకులు దాసరి చంద్రశేఖర్, గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణగుప్తా పేర్కొన్నారు. ఆదివారం వారు బీజేపీ సంకల్ప యాత్ర నిర్వహించారు. పలు ప్రాంతాల్లో మోదీ ప్రభుత్వ అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశ ప్రజలందరూ మోదీని మరోసారి ప్రధానమంత్రిగా చూడాలని ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో భారత్‌ను నెంబర్:1 స్థాయిలో తీర్చిదిద్దిన బీజేపీని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.

హిదాయత్ అలీఖాన్‌కు ఉత్తమ సేవా అవార్డు



హిదాయత్ అలీఖాన్‌కు మెమెంటో అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: మూడు దశాబ్దాలకు పైగా విద్యా రంగంలో ఉంటూ ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దిన మహ్మద్ హిదాయత్ అలీఖాన్ సేవలు వెలకట్టలేనివని టోలిచౌకీ సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ రియాజ్ అలీఖాన్ అన్నారు. ఆదివారం టోలిచౌకీ గోల్డెన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ షేక్‌పేట్ మండల్ వారిచే జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ రియాజ్ అలీఖాన్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల వారు విద్యా రంగంలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్‌తో పాటు షేక్‌పేట్ మండలంలోని పలువురు ఉపాధ్యాయులకు ఆయన ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు.

పర్యాటకుల సందడి



చార్మినార్: వీకెండ్ కావడంతో ఆదివారం పాతబస్తీలోని పర్యాటక స్థలాలన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్, మక్కా మసీదు, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియంలు సందర్శకులతో కళకళలాడాయి. ఇప్పుడిప్పుడే ఎండ వేడిమి పెరుగుతున్నా.. ఆదివారం అంతగా వేడి లేకపోవడమే కాకుండా వాతావరణం ఆహ్లాదకరంగా చల్లగా ఉండటంతో సందర్శకులు ఎంతో ఉల్లాసంగా..ఉత్సాహంగా చార్మినార్ కట్టడం ప్రాంగణంతో పాటు పరిసరాల్లో గడిపారు. సందర్శకులతో చార్మినార్ పర్యాటక పరిసరాలు రద్దీగా మారాయి.

ఖురాన్ పఠనం చేసిన వారికి పట్టాల ప్రదానం



ఖురాన్ పూర్తి చేసిన వారితో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: చిన్న వయస్సులోనే ఖురాన్ గ్రంథాన్ని కంఠస్తం చేసిన వారు భవిష్యత్తులో ఎంతో ఉత్తములుగా ఎదుగుతారని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం హకీంపేట్‌లోని మదర్సా అబ్బాస్ బిన్ అఫాన్‌లో వివిధ ఇస్లామిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాలు పొందిన వారు ఉన్నత చదువులు సైతం చదవాలని అన్నారు. మదర్సా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మౌలానా జాఫర్ పాషా అహ్మద్ హుసామీ తదితరులున్నారు.

అభినందనలు



చిన్నారెడ్డిని సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి జి.చిన్నారెడ్డిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరి పోల్కం శ్రీనివాస్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాశం రాజేందర్ యాదవ్, నర్సింగ్‌రావు, పోల్కొం వినయ్‌రాజ్ ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రగతికి, రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చిన్నారెడ్డి సేవలు అమోఘంగా నిలుస్తాయన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గోల్కొండ: మార్నింగ్ వాకర్స్ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని కుల్సుంపురా పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రక్షిత్‌సాగర్ అన్నారు. వాకర్స్ అసోసియేషన్ సౌజన్యంతో శ్రీకర ఆసుపత్రి వారు ఆదివారం ఉదయం కార్వాన్ కుల్సుంపురాలోని పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్నింగ్ వాకర్స్ సభ్యుల కోసం ప్రైవేటు ఆసుపత్రుల వారు ముందుకు వచ్చి వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా మార్నింగ్ వాకర్స్‌కు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు.

మల్లు వెంకటేశ్వర్లుకు నివాళి



నివాళులర్పిస్తున్న కే.ఎస్.ఆనంద్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్

చార్మినార్: ఆయుష్ విభాగం మాజీ అడిషనల్ డైరెక్టర్, మల్లు రవి సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు సంతాప సభ (పెద్ద కర్మ)లో గౌలిపురాకు చెందిన టీపీసీసీ కార్యదర్శి కే.ఎస్.ఆనంద్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 10కే రన్



చార్మినార్ వద్ద జెండా ఊపి 10 కే రన్‌ను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

చార్మినార్: చార్మినార్ నుంచి గోల్కొండ వరకు ఆదివారం నిర్వహించిన 10 కే రన్‌ను టూరిజం శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. కేఎస్ఆర్ సైకిల్ ఈవెంట్స్ వ్యవస్థాపకులు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ 10 కే రన్‌లో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నగర పోలీసులు, జీహెచ్ఎంసీలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఈ 10 కే రన్‌కు సహకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి



కందికొండ శ్రీనివాస్

అబిడ్స్: విద్యారంగ వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర గణిత ఫోరం (టీఎంఎఫ్) అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. గణిత శాస్త్రంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, గణితశాస్త్ర నిపుణులకు నిరంతరం సలహాలు సూచనలు చేసి గణితశాస్త్ర వ్యాప్తికి ముందుంటునన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర గణితఫోరం అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణిత శాస్త్రంలో విద్యార్థులకు పలు విప్లవాత్మకంగా మార్పులు తెచ్చి వారిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. గణితంతోనే విశ్వం మొత్తం ముడిపడి ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే గణితంలో రాణిస్తే ఆ విద్యార్థులకు అన్ని రంగాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గణిత విభాగంలో కొత్త తరహాలో విప్లవాత్మక మార్పులు తెచ్చి విద్యారంగానికి అభివృద్ధి చేయడమే తన ఉద్దేశమని కందికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న కందికొండ శ్రీనివాస్‌ను రాష్ట్ర అపోపా అధ్యక్షుడు మల్లిపెద్ద శంకర్, ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్, అదనపు ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్‌లు అభినందనలు తెలిపారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి



మాధవీలతను సన్మానిస్తున్న సంఘం గౌరవ అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్ తదితరులు

జియాగూడ: సంత్ రవిదాస్ మహరాజ్ కులవృత్తిని నిర్వహిస్తూ ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ మార్గదర్శకంగా నిలిచాడని విరించి హాస్పిటల్స్ చైర్‌పర్సన్ కె.మాధవీలత అన్నారు. శనివారం రాత్రి జియాగూడలోని సంజయ్‌నగర్‌లోని సంత్ రవిదాస్ ఆలయం వద్ద సూర్యవంశీ సంత్ రవిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘ్ గౌరవ అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్ చౌదరి, అధ్యక్షుడు పి.మనోహర్‌లాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సంత్ రవిదాస్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంత్ యోగీ మహరాజ్, జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ, జైస్వాల్ సమాజ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాజేందర్ పర్షాద్ జైస్వాల్, గోల్కొండ జిల్లా బీజేపీ డైరీ సెల్ కన్వీనర్ బి.శివకుమార్‌యాదవ్ హాజరై రవిదాస్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింగ్‌లాల్ పర్వారే, మనోహర్‌లాల్ మాహోరే, వినోద్ దయాల్, ఉమేష్ మహేష్కర్, మనోహర్ వినయ్‌కర్, ముఖేష్ మహోరే, గణేష్ దేవికర్, తుల్జేష్ దేవ హంస, రాజేష్‌రవి, సి.తుల్జేష్, సురేష్ వినయ్‌కర్, గణేష్ దేవికర్, సంజు పర్వారే, బీజేపీ నాయకులు సుభాష్‌కుమార్ వాగ్మారే, సుదర్శన్ ముదిరాజ్, బాబుగురు, ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ, రాజేందర్ డేగాన్, దేవర వంశీ, జగదీశ్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి



గోల్డ్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, హీరో బెల్లంకొండ శ్రీనివాస్

గోల్కొండ: వయసుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ ఫిట్‌నెస్‌పై జాగ్రత్త వహించాలని కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు.. శనివారం రాత్రి ఆయన షేక్‌పేట్‌లోని అపర్ణ యాస్టిట్యూట్‌లో గోల్డ్ జిమ్‌ను ప్రముఖ టాలివుడ్ నటుడు బెల్లంకొండ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆసక్తికి అనుగుణంగా గోల్డ్ జిమ్ వారు అంతర్జాతీయ ప్రమాణాలతో జిమ్‌ను ఒక ఫిట్‌నెస్ స్టూడియోలా రూపొందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఆయన జిమ్ నిర్వాహకుడు ఆలీహసన్‌తో కలిసి జిమ్‌లో ఉన్న వివిధ రకాల యంత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిమ్ మేనేజర్ ఎం.ఎ.తౌఫిక్, కాంగ్రెస్ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంస్కృతిని పెంపొందించేందుకు కృషి



సమావేశంలో రామ సుబ్రహ్మణ్యంజీ, మాధవీలత

అబిడ్స్: హిందూ సంస్కృతిని పెంపొందించేందుకు అందరు కలిసికట్టుగా కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ రామ సుబ్రహ్మణ్యంజీ పేర్కొన్నారు. ప్రతి ఒక్క హిందువు హిందూ సమాజంపై జరుగుతున్న దాడులను పసిగట్టి వాటిని తరిమివేసేందుకు ఐక్యంగా ఉండాలన్నారు. ఆదివారం హిందూ జన జాగరణ వేదిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. హిందువులు ఆరాధించే గో సంపద, మందిర వ్యవస్థ, ఉత్సవాలు, పండుగల పైన విచ్ఛిన్నకర శక్తుల దాడులు పెరిగిపోయాయన్నారు. అలాంటి దాడులను అందరు ఏకతాటిగా ఉండి కూకటి వేళ్లతో తొలగించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి హిందువును చైతన్యవంతులుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లతమా ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ నర్సింగ్‌దాస్, ప్రతాప్ సర్వే, ముక్లె రాకేష్‌తో పాటు దాదాపు 300 మంది పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి సన్మానం



ఇంద్రసేనారెడ్డి దంపతులకు జ్ఞాపికను అందజేసి సన్మానిస్తున్న సొసైటీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: నిజాం హయాంలో నగర కొత్వాల్‌గా సేవలందిస్తూనే ప్రతి ఒక్కరూ విద్యను అందిపుచ్చుకోవాలనే దృఢ సంకల్పంతో ప్రారంభించిన రెడ్డి హాస్టల్‌లో తాను సభ్యుడిగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అబిడ్స్‌లోని రాజా బహదూర్ వెంకటరామరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్డి హాస్టల్ ఆడిటోరియంలో నల్లు ఇంద్రసేనారెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ హాస్టల్‌లో తాను చదువుకోకపోయినా సభ్యత్వం పొందినందుగా ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ హాస్టల్లో విద్యను అభ్యసించి లబ్ధి పొందిన విద్యార్థులు రెడ్డి హాస్టల్ అభ్యున్నతికి పాటు పడేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ ఇంద్రసేనా రెడ్డి, రేణుకా దంపతులను జ్ఞాపికతో సన్మానించారు. అంతకు ముందు మాజీ అడిషనల్ ఎస్పీ, రచయిత పెద్దిరెడ్డి తిరుపతి రెడ్డి రచించిన ఆదర్శ పదంలో పోలీసుల సమగ్ర పరిశీలన పుస్తకానిన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు వెంకట రంగారెడ్డి, కార్యదర్శి తీగల మోహన్‌రెడ్డి ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుకన్యరెడ్డి, వాసుదేవరెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నందుకుమార్, దశరథరెడ్డి, వేమిరెడ్డి, నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

మల్లయ్య సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్

సుల్తాన్‌బజార్: మత్స్యకారుల మహా నాయకుడు సర్దార్ ఏఎల్.మల్లయ్య అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం కోఠి హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవనంలో మల్లయ్య తొలి వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా వకుళాభరణం కృష్ణమోహన్ హాజరై మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..బీసీ కులాలను ముఖ్యంగా సంచారజాతుల హక్కుల పరిరక్షణకు మల్లయ్య తన చివరి శ్వాస వరకు పోరాడారని కొనియాడారు. రాష్ట్రంలో జరిగిన బీసీ కులాల హక్కుల కోసం గౌతు లచ్చన్న, కొండా లక్ష్మణ్ బాపూజీల అడుగుజాడల్లో మల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మల్లయ్య స్మారకార్థం జీవిత సాఫల్య పురస్కారాలను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్టు సాయిప్రసాద్, ప్రొఫెసర్ బాగయ్య, లక్ష్మయ్య, శ్రీహరి, శివరత్నం, అంబటి సత్యనారాయణ, శ్రీనివాస్, సుధాకర్, సంతోష్, స్వర్ణలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.